# కౌన్ బనేగా 'పోటీ'పతి

- డాక్టర్ ఎం. సుగుణారావు

ఉదయం పూట వీక్లీ చదువుతున్న వినాయకరావు భార్య సుబ్బలక్ష్మిని పిలిచి... 'మన పంట పండబోతోందేవ్... చూశావా ఈ ప్రకటన...' అంటూ గట్టిగా చదువుతున్నాడు.

- 'ముగ్గుల పోటీ... మగవారికి మాత్రమే. బహుమతి లక్ష రూపాయలు. ఎంట్రీ ఫీజు రూపాయి మాత్రమే. పోటీలో పాల్గొనేవారు ముగ్గు పిండి లాంటి తెల్లటి కాగితం మీద నల్లటి చుక్కలతో ముగ్గు వేసి పంపాలి. ఆ ముగ్గు తమ స్వంతమనీ, దేనికీ అనుసరణ, కాపీ కాదనీ, ఇదివరలో ఎక్కడా ప్రచురించలేదనీ, ఏ ఇంటి గుమ్మం ముందూ వేయలేదనీ హామీ పత్రం జతచేయాలి. ఈ ముగ్గుల పోటీ స్పాన్సర్ చేస్తున్నవారు స్థానిక నడుంనొప్పి మాత్రల కంపెనీ మరియు స్థానిక ముగ్గు పిండి కంపెనీ... ఈ పోటీలో పాల్గొనేవారు మా స్పాన్సర్ కంపెనీ ముగ్గే వాడాలి. నడుంనొప్పి కోసం మా స్పాన్సర్ కంపెనీ మాత్రల్ని ప్రత్యేకంగా తయారు చేస్తోంది. వీటికి సంబంధించి వి.పి.పి. ద్వారా ఒక కిట్ పంపబడుతుంది. ఐదు వందలు చెల్లించి దీనిని విడిపించుకోవచ్చును'.

ప్రకటన చదివిన వినాయకరావు- 'పోతేపోయింది ఐదొందల ఒక్క రూపాయికి లక్ష రూపాయలు...' అనుకుంటూ కలల్లో తేలిపోతున్నాడు.

సుబ్బలక్ష్మి తన భర్త వంక జాలిగా చూసింది. అతడికి ముగ్గులు వెయ్యడం రాదు... అయినా పోటీలలో పాల్గొంటాడు. తన భర్తకు ఈ మధ్య పోటీల పిచ్చి పట్టుకుంది. కష్టపడకుండా పోటీల ద్వారా డబ్బు సంపాదించాలి.

- 'కారులో రానూ పోనూ,
దాంతోపాటే మొబైల్ ఫోను
ఇంట్లో ఫ్యాను.
నోట్లో ఎప్పుడూ మిఠాయి పాను.
వీటి కోసమే పోటీల్లో పాల్గొంటాడతను'

- అలా కవిత్వం రాసుకుని డబ్బు సంపాదనే లక్ష్యంగా రకరకాల పోటీల్లో పాల్గొంటున్నాడు.

ఆ మధ్య ఏదో వాకర్స్ క్లబ్బు వాళ్ల నడక పోటీ పెడితే ఆరు మైళ్ల దూరంలో వున్న ఆఫీసుకు స్కూటర్లో వెళ్లడం మానేసి నడవడం ప్రారంభించాడు ప్రాక్టీసవుతుందని. ఉదయం ఆరు గంటలకే బయలుదేరి అర్ధరాత్రి ఇంటికొచ్చేవాడు. అలా ప్రాక్టీసయితే చేశాడు కానీ, ఆ పోటీ రోజున పాదాలు వాచి అసలు పోటీలో పాల్గొనే అవకాశమే లేకుండా పోయింది.

'ఇక ఈ మధ్య అవసరం వున్నా లేకపోయినా సూపర్‌బజార్ కెళ్లి రకరకాల సామానులు కొనడం... వాటిలో 'స్క్రాచ్... టు విన్' అని కనిపిస్తే చాలు గీకడం... అలా తను 'గీకు వీరుడు... నా రాకుమారుడు' అని పాడుకోవడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇపుడు 'కోటికి ఎవరు పడగెత్తుతారు' అనే టీవీ కార్యక్రమం మీద పడ్డాడు. అందుకోసం కనబడిన జనరల్ నాలెడ్జి పుస్తకమల్లా కొంటున్నాడు. ఆ టీవీ క్విజ్‌లో వేసే ప్రశ్నలు మూడు, నాలుగు తరగతుల్లోని పుస్తకాల్లో వున్నాయని తమ అపార్ట్‌మెంటులోని పిల్లలకు ట్యూషన్లు చెబుతున్నాడు. తను నేర్చుకున్న విజ్ఞాన విషయాలు మరిచిపోకుండా వుండడానికి తనే ఒక క్విజ్ కార్యక్రమం ప్రారంభించాడు పిల్లలందరికీ. దాని పేరు 'కౌన్ బనేగా చాక్లెట్‌పతి'. చిన్న బబుల్‌గమ్‌తో మొదలై ప్రశ్నలన్నీ చెప్పిన కుర్రాడికి పెద్ద సైజు చాక్లెట్ బార్ ఇస్తాడు. ఇలా పోటీలో పాల్గొనేందుకు పెట్టుబడి పెడుతున్నాడు గానీ రాబడి లేదు!

- ఇలా ఆలోచనల్లో మునిగిన సుబ్బలక్ష్మి భర్త పిలుపుతో ఇహంలోకి వచ్చింది.

'సుబ్బూ... అలా బజారుకెళ్లి ఒక బస్తాడు ముగ్గు, కొన్ని ముగ్గు పుస్తకాలు కొనుక్కొస్తాను' అన్నాడు వినాయకరావు.

'ఆ స్పాన్సర్ కంపెనీ వారి ముగ్గు పిండి మాత్రమే వాడమని వి.పి.పి. ద్వారా పంపుతామని అన్నారు కదా... మరిచిపోయారా!' అంది సుబ్బలక్ష్మి.

'లేదు. దానికీ డబ్బు కడతాను. అది వచ్చే వరకూ ముగ్గు కావాలి కదా...' అంటూ బైటకు వెళుతున్న భర్తను చూసి నిట్టూర్పు విడిచింది సుబ్బలక్ష్మి.

✦✧✦

అలారం ఐదు కొట్టింది. నిద్ర నుంచి లేచిన సుబ్బలక్ష్మి పక్క మీద భర్త లేకపోవడంతో కంగారుపడింది. సాధారణంగా ఉదయం తొమ్మిదింటికి మాత్రమే లేచే వినాయకరావు ఐదు గంటలకే మాయమవడంతో ఆమెకు ఎక్కడికి వెళ్లాడో అర్థం కాలేదు. బాత్రూమూ, ఇల్లు వెతికి బైటకొచ్చింది. ఇంటిముందు రథం ముగ్గు వేసి వుంది. కాసేపు ఆ ముగ్గు వంకే చూస్తూ ముందుకెళ్లింది.

మార్నింగ్ వాక్‌కు వెళుతున్న తన భర్త ఫ్రెండ్ కనిపించి 'మీ ఆయన రథం ముగ్గు వేస్తూ అలా ముందుకు వెళుతున్నాడు. ముగ్గులు చూడడానికట...' అనేసరికి అంత కంగారులోనూ భర్త మీద కోపం వచ్చింది సుబ్బలక్ష్మికి.

✦✧✦

తరువాతి రోజు ముగ్గుల కంపెనీ వారి నుంచి కిట్ వచ్చింది. ఐదు వందలు చెల్లించి వి.పి.పి. విడిపించాడు. చిన్న సంచీలో ముగ్గు, ఒక డబ్బా నిండా నడుంనొప్పి మాత్రలు, నడుంనొప్పి వస్తే రుద్దుకోవడానికి ఉపయోగించే నల్లటి మందు వున్నాయి ఆ కిట్‌లో.

ఇక అతడి ముగ్గుల ప్రాక్టీసు ఉధృతమయింది. రోజూ ఉదయమే లేవడం, కాగితం, పెన్నుతో బయలుదేరడం. సంక్రాంతి సీజను కాబట్టి ప్రతీ ఇంటిముందు ముగ్గులు కనిపిస్తాయి. వాటిలో బాగున్నవి కాగితం మీద గీసుకోవడం... ఇలా ఎవరైనా అమ్మాయి వంగొని ముగ్గేస్తుంటే చూసేసరికి 'వీడెవడండీ ప్రొద్దున్నే అమ్మాయిల వెంట పడుతున్నాడు... వేళా లేదు, పాళా లేదు' అని తిట్టుకున్న వాళ్లు... కొన్నిసార్లు అనుమానించి కొట్టబోయిన వాళ్లూ ఉన్నారు.

మరో రోజు ఎవరో మహిళామణి ముగ్గు వేస్తుంటే 'ముగ్గు బావుంది' అనేశాడు. అక్కడే వున్న ఆమెగారి భర్తకు ఆ మాట మరో విధంగా వినబడి 'నా పెళ్లాం ముక్కు బావుందని కామెంట్ చేయడానికి నువ్వెవడివిరా' అంటూ యుద్ధానికి దిగాడు.

అయితే వినాయకరావు వెంటనే 'మాస్టారూ... ఇది ముళ్లపూడి వారి జోకు' అన్నాడు.

ఆ వ్యక్తికి మరీ కోపం వచ్చి 'జోకు అంటే గుర్తొచ్చింది... ఇంట్లో బాకుంది కదా... పొడిచి పారేస్తాను' అనేసరికి తన కాళ్లకు బుద్ధి చెప్పాడు వినాయకరావు.

✦✧✦

రోజులు గడుస్తున్నాయి. ముగ్గుల పోటీ 'ముగ్గు'లోకి దిగి తల ముగ్గు బట్ట అయ్యేలా ఆలోచించాడు గానీ వినాయకరావు ఏ సరికొత్త ముగ్గూ వెయ్యలేకపోతున్నాడు.

ఒకరోజు తెల్లవారుఝామునే యథావిధిగా ముగ్గుల వేటలో ముందుకు వెళుతున్నాడు వినాయకరావు. వేసుకున్న తెల్లటి చొక్కా మీద ఓ ఇల్లాలు కళ్లాపి చల్లింది పొరపాటుగా.

'సారీ! అండీ...' అంటూ ముందుకొచ్చి చూసింది.

ఆ చొక్కా మీద ముగ్గేసినట్లుగా డిజైను. దాన్ని చూసి 'యురేకా' అంటూ అరిచాడు వినాయకరావు.

ఆమె భయపడుతూ 'షర్టిచ్చెయ్యండి ఉతికేసి ఇస్తాను' అంది.

'ఒద్దు తల్లీ... ఈ డిజైను బాగుంది, నేను ఇంతకాలం నుంచి ఎదురు చూస్తున్న ముత్యాల ముగ్గు... దీన్ని పాడుచెయ్యకు...' అంటూ ఇంటికి పరిగెత్తాడు.

కళ్లాపు మరకలతో ఇంటికొచ్చిన భర్తను చూసి కెవ్వుమని అరిచింది సుబ్బలక్ష్మి.


'ఏవండీ ఎవరినైనా పొడిచారా... ఏమిటా రక్తపు మరకలు...' అంటూ ఆమె భయపడింది.

ఈ మధ్య ముగ్గుల వేటలో భర్త గొడవపడడం... ఒక వ్యక్తి బాకు తీసుకొచ్చి పొడుస్తానని శపథం చేయడం... ఈ నేపథ్యంలో ఇతగాడే పొడిచి పారిపోయి వచ్చి వుంటాడనే భయంకొద్దీ సుబ్బలక్ష్మి వెంటనే నీళ్లు తీసుకొచ్చి ఆ చొక్కా మీద పోసింది. క్షణంలో ఆ చొక్కా మీద మరకలు మాయం...

'పోనీలెండి మీరు ఎవరినో పొడిచిన ఆనవాళ్లు లేకుండా చేసేశాను... ఇక నిశ్చింతగా వుండండి, పోలీసులొచ్చినా భయపడొద్దు...' అందామె తాపీగా.

ఆమె మాటలకు, చేసిన పనికి వినాయకరావు కుమిలిపోతూ... 'బంగారంలాంటి ముగ్గు పాడుచేశావ్... ఇపుడు నా మీద ఏ ఇల్లాలు కళ్లాపి చల్లుతుంది... అది ఇంత అందమైన ముగ్గులా రూపుదిద్దుకుంటుందా...?'

వినాయకరావు విలాపంతో సుబ్బలక్ష్మికి జరిగిన విషయం అర్థమై భర్త అతితెలివికి బాధపడుతూ యథావిధిగా నిట్టూర్చింది.



✦✧✦

రెండు రోజుల తర్వాత ఎప్పటిలాగే తెల్లవారక మునుపే పాదయాత్ర ప్రారంభించాడు వినాయకరావు.

ఎవరో బిచ్చగాడు 'కొంచెం చద్దన్నం వుంటే పడెయ్యండి తల్లీ...' అంటూ అడుక్కుంటున్నాడు.

'నా చొక్కా మీద కాసిన్ని కళ్లాపి నీళ్లు పడెయ్యండి తల్లీ' అందామనుకుని, బావుండదేమో అని ఊరుకున్నాడు.

కొంతదూరం వెళ్లేసరికి ఒక ఇంటిముందు ఒక పదేళ్ల అమ్మాయి ముగ్గు వేస్తూ కనిపించింది. షాక్ కొట్టినట్టు ఆగిపోయాడు వినాయకరావు.

అదొక సరికొత్త ముగ్గు. ఇప్పటివరకూ తను ఏ పుస్తకంలోనూ, ఏ ఇంటి గుమ్మం ముందూ చూడనిది.

వెంటనే ఆ అమ్మాయిని అడిగాడు... 'పాపా ఈ ముగ్గు ఎక్కడ నేర్చుకున్నావ్' అని.

'లేదంకుల్ ఇప్పుడే వేస్తున్నాను...' అంది ఆ అమ్మాయి గర్వంగా.

అంతే, ఆ క్షణంలోనే ఆ ముగ్గును స్వంతం చేసుకోవాలనే దురాశ కలిగింది వినాయకరావుకు. ఆ అమ్మాయి ముగ్గు పూర్తిచేసే వరకు ఆమె వెనకే నిల్చుని కాగితం మీద మొత్తం గీసేశాడు. ఆ తరువాత మౌనంగా అక్కణ్ణించి కదిలాడు.

కొన్ని అడుగులు వేసేసరికి అనుమానం వచ్చింది వినాయకరావుకు- 'ఉదయమే దీన్ని తనలాగే ముగ్గుల పోటీలో పాల్గొనే మగాడెవరైనా మళ్లీ కాపీ కొడితే... మైగాడ్! బహుమతి మొత్తం ఇద్దరికీ సమానం అంటారు. అందుకు తనేం చెయ్యాలి? గబగబా మళ్లీ వెనక్కు వచ్చాడు వినాయకరావు. అక్కడ ఎవరూ లేరు. ఆ చిన్నమ్మాయి లోపలికెళ్లిపోయింది. అంతే, వినాయకరావులోని విలన్ బైటకొచ్చేశాడు. చాలా వేగంగా ఆ అమ్మాయి గీసిన ముగ్గును చెరిపేసి అక్కణ్ణించి పరిగెత్తాడు, లేకపోతే ఎవరైనా చూసి తంతారని.

✦✧✦

చిన్నమ్మాయి నుంచి తస్కరించిన ముగ్గును చక్కగా గీసి వెంటనే ముగ్గుల పోటీకి పంపేశాడు వినాయకరావు. పంపిన తర్వాత ప్రతీ వారం వీక్లీ కొనడం, ముగ్గుల పోటీ ఫలితాల కోసం వీక్లీ తిరగెయ్యడం... ఇలా కొన్ని వారాలు భారంగా నిరీక్షణలో గడిచాయి.

నెల తర్వాత, వినాయకరావుకు పత్రికాఫీసు నుంచి ఉత్తరం వచ్చింది. వినాయకరావు సంతోషం పట్టలేకపోయాడు.

'సుబ్బూ! ప్రైజు మనకే వచ్చినట్టుంది, కవరు బరువుగా వుంది...' అంటూ భార్యను పిలిచాడు.

సుబ్బలక్ష్మి వంటింట్లోంచి పరిగెత్తుకుంటూ వచ్చి- 'పోనీలెండి ఆ ప్రైజు వస్తే మనం ఆ లక్ష రూపాయలు... వారం క్రితం లక్కీడిప్ అని పిలిచి విసిగించిన వాళ్ల ముఖాన కొడదాం... హాయిగా విదేశాలన్నా చూడొచ్చు...' అంది ఆశగా.

'లేదు... నేను రేసులు ఆడదాం అనుకుంటున్నాను. ఈ లక్షను కొన్ని కోట్లు చెయ్యాలి' అన్నాడు గంభీరంగా.

'పోదురూ బడాయి... ముందు కవరు విప్పండి...' అందామె విసుగ్గా.

గబగబా కవరు చించి చదవడం ప్రారంభించాడు.

'ఆర్యా! మీరు ముగ్గుల పోటీలో పాల్గొన్నందుకు అభినందనలు. ఈ పోటీకి దాదాపు రెండు లక్షల ఎంట్రీలు వచ్చాయి. దాంట్లో లక్ష ముగ్గులు బహుమతికి యోగ్యమైనవిగా వున్నాయి. అందుకోసం లక్ష రూపాయల బహుమతి మొత్తాన్ని అందరికీ సమానంగా పంచుతున్నాం. ఈ ఉత్తరంలోని బహుమతి మొత్తాన్ని స్వీకరించగలరు.'

– 'అంటే? ఎంట్రీ ఫీజు బహుమతిగా వచ్చిందా...?' ఉత్తరం చదవడం పూర్తిచేసి ప్రశ్నార్థకంగా చూశాడు వినాయకరావు.

ఆమె సమాధానం చెప్పకమునుపే ఆ కవరులోంచి రూపాయి బిళ్ల రంగ్ మంటూ నేలమీద పడింది అతడిని వెక్కిరిస్తూ.

ఆ ఉత్తర క్షణంలో వారి పదేళ్ల కొడుకు టీవీ ఆన్ చేశాడు. టీవీ స్క్రీన్ మీద ఒక ప్రకటన ప్రత్యక్షమయింది.

– 'కౌన్ బనేగా పోటీపతి?! అధిక సంఖ్యలో ఏ రకమైన పోటీల్లో పాల్గొన్నా వారికి అపురూపమైన బహుమతి ఇవ్వబడుతుంది. వెంటనే మా చిరునామాకు రాయండి...'

ఆ పోటీ ప్రకటన వంక ఆశగా చూస్తున్న వినాయకరావు వైపు కోపంగా చూస్తూ- 'వినాయకరావూ... నీ పేరు విక్రమార్కరావు... వర్ధిల్లు...' అంటూ విసవిసా ఆ గదిలోంచి నిష్క్రమించింది అతడి భార్య సుబ్బలక్ష్మి.

❀

## గుడ్లు కింగ్

**ఈ** మధ్యన మా అమ్మాయి పెళ్లి సంబంధాల సందర్భంలో కొందరు అబ్బాయిల ఫొటోలు పరిశీలిస్తున్నాం! స్మార్ట్‌గా కనబడుతున్న ఓ కుర్రాడి ఫొటో మా అమ్మాయికి చూపించి- ఈ కుర్రాడి మీద నీ అభిప్రాయమేమిటని అడిగాను. మా అమ్మాయి ఆ ఫొటో కాసేపు పరిశీలనగా చూసి- 'గుడ్లు కింగ్' అంది. 'గుడ్లు కింగా? అంటే గుడ్లు బాగా తినడంలో ఆరితేరిన వాడా? మా అమ్మాయి ఆ కుర్రాడిని ఆ ఫొటోలో తప్ప మునుపెన్నడూ చూడలేదే! కొంపదీసి మా అమ్మాయికి ఆ కుర్రాడు ముందే తెలుసా! గుడ్లు తినే పోటీలో ఫస్ట్ వచ్చాడా ఎప్పుడైనా? ఇన్ని సందేహాలు నా మనసులో. అదే అడిగేశాను మా అమ్మాయిని. నా అనుమానానికి విస్మయపడిన మా అమ్మాయి 'గుడ్ లుకింగ్ నాన్నగారూ' అని విడదీసి చెప్పిన తరువాత గానీ అర్థం కాలేదు నాకు- ఆ కుర్రాడు అందంగా కనబడుతున్నాడన్నది- మా అమ్మాయి భావమని.

– *కోనే*